ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 24 | సంచిక : 02 | అక్టోబరు 2018

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 16
గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రూ|| 150/-
విడి ప్రతి : రూ|| 12/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప||గో|| జిల్లా, ఆం||ప్ర||

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
08814 - 224747
9247104551

ఈ సంచికలో....

02-09-1984
జిన్నూరు

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 02-09-1984, జిన్నూరు)

నిరంతరమూ తన స్వరూపమైన బ్రహ్మము యందు చరించేవాడు బ్రహ్మచారి. చాలామంది ఉద్దేశం ఏమిటి అంటే పెళ్ళి చేసుకోకుండా ఉంటే వాడు బ్రహ్మచారి అని. కానీ నిజమైన అర్థం ఏమిటంటే 'తన స్వరూపమైన బ్రహ్మము యందు 24 గంటలూ చరించేవాడు బ్రహ్మచారి'. బాహ్యమైనటువంటి బ్రహ్మచర్యం ఎందుకు నియమించారంటే అసలు లోపల ఉన్న బ్రహ్మ స్వరూపాన్ని తెలుసుకోవటానికి అదొక సహాయకారి. అంటే కేవలం బ్రహ్మచర్యం అవలంభించుట వల్లే బ్రహ్మ స్వరూపం తెలియబడదు. కొందరు 70 ఏళ్ళు, 80 ఏళ్ళు బ్రహ్మచర్యం అవలంభించిన వాళ్ళని చూసాను - రాతి మనస్సులు! అసలు ఏమీ హృదయంలో రసం లేకుండా సంస్కారం లేకుండా ఉంటారు - వాళ్ళు బాహ్యంగా బ్రహ్మచారులే. కానీ హృదయంలో ఏమీ పరివర్తన లేకుండా, సంస్కారం లేకుండా, పరిశుద్ధత లేకుండా, 70 ఏళ్ళు 80 ఏళ్ళు జీవించి చనిపోయిన వాళ్ళు ఉన్నారు. వారి హృదయంలో ఏమీ మార్పు, ఏమీ వికాసం కనబడదు.

బ్రహ్మచర్యం అనేది ఒక సహాయకారి మాత్రమే. బ్రహ్మచారిగా ఉన్న వాడికి ఆత్మ తెలుస్తుందని పెళ్ళి చేసుకున్న వాడికి ఆత్మ తెలియదని ఎవరూ అనుకోవద్దు. అది పొరపాటు. పెళ్ళిలో ఏదో భూతం ఉందని మీరెవరూ అనుకోవద్దు. పెళ్ళి చేసుకుంటే ఆత్మ తెలియదని, పెళ్ళి చేసుకోకుండా ఉంటేనే ఆత్మ తెలుస్తుందని అటువంటి అపార్థాలు చేసుకోకండి. అయితే మన పెద్దలు ఈ ఏర్పాటు ఎందుకు పెట్టారంటే - పెళ్ళి చేసుకుంటే సంసారం వస్తుంది, సంసారం వస్తే తన కాలాన్ని కొంత సంసారానికి ఖర్చు పెట్టాలి, బ్రహ్మస్వరూపాన్ని గుర్తించటానికి అతనికి ఎక్కువకాలం ఉండదు. అందుకని పెళ్ళి చేసుకోకుండా ఉండటం మంచిదని చెప్పారు. కానీ, పెళ్ళి చేసుకుంటే ఆత్మ తెలియబడదని

ఎక్కడా లేదు.  మన పూర్వపు ఋషులలో కూడా కొందరు వివాహాలు అయిన వాళ్ళు ఉన్నారు. వాళ్ళలో ఆత్మను దర్శించిన వాళ్ళు ఉన్నారు.

నేను చెప్పేది ప్రతీ అక్షరం కూడా మీకు కేష్ బేరం చెపుతున్నాను, నేను మీకు ఒక చెక్కు రాసిచ్చి మీరు చనిపోయిన తరువాత మారుతుంది అంటే, ఎందుకండీ అది?  నేను ఒక చెక్కు రాసిస్తాను మీకు, మీరు చనిపోయిన తరువాత అది బ్యాంకులో మారుతుంది అంటే, మీరు ఆచెక్కుని ఏమి చేసుకొంటారు?  ఇప్పుడు ఈ క్షణంలో తేలిపోవాలి మనం మాట్లాడుకునే మాటల యొక్క రిజల్ట్.  ఇప్పుడు మీకు ప్రత్యక్షంగా కనిపిస్తుంది మీరు అర్థం చేసుకోవటంలో పొరపాటు లేకుండా ఉంటే.  ఆహారం నియమంగా ఎందుకు తినమన్నారు అంటే ఆహారం ఎక్కువగా తింటే అజీర్తి వల్ల ఏకాగ్రత పోతుంది కాబట్టి, ఆహారం నియమంగా తీసుకుంటే ఆత్మని తెలుసుకోవటానికి సహకరిస్తుంది కాబట్టి ఆహారం నియమంగా తీసుకోమన్నారు.  సత్పురుషుల సహవాసం ఎందుకు చెయ్యమన్నారు అంటే మీలో ఉన్న దుష్టసంస్కారాలు సత్పురుషుల సహవాసం వల్ల పోతాయి కాబట్టి సత్పురుష సహవాసం చెయ్యమన్నారు.  ఇదంతా కూడా, బ్రహ్మచర్యం అవలంభించమన్నా, సత్పురుష సహవాసం చెయ్యమన్నా, ప్రాణాయామం చెయ్యమన్నా ఏది చెయ్యమన్నా కూడా మీలో ఉన్న సత్య వస్తువుని, ప్రత్యక్షంగా మీ హృదయంలో ప్రకాశిస్తున్న ఆత్మని, తెలుసుకోవటం కోసం ఇవన్నీ చెయ్యమన్నారు. కానీ ఇవన్నీ అది మటుకు కాదు.  మీలో ప్రకాశిస్తున్న ఆత్మ పరోక్షం కాదు, ప్రత్యక్షం.  ఇప్పుడే ఇక్కడే మీరు కూర్చున్న చోటే కదలకుండా మెదలకుండా అది మీకు దర్శనం ఇస్తుంది.  అది ఇక్కడే ఉంది కాబట్టి.  ఈ శరీరానికి చావు ఉంది, దానికి చావు లేదు.

తన మనస్సు బ్రహ్మముయందే చరిస్తోంది అనుకోండి, తాను బ్రహ్మమే అయ్యి ఉన్నాడు అనుకోండి, ఇంద్రియాలకి సంబంధించినటువంటి ఏ సుఖాలనీ వాడు కోరడు. ఎందుచేత కోరడంటే, తాను ఆనందం అయ్యి ఉన్నాడు కనుక.  సినిమాలు చూడటం ద్వారా, పెళ్ళిళ్ళు చేసుకోవటం ద్వారా, మంచి సంగీతం వినటం ద్వారా, లేకపోతే మీ ఇంద్రియాల సంతృప్తికి మీకు ఇష్టమైన కూర తినటం ద్వారా మీరు ఏ రకమైన సుఖాన్ని ఆనందాన్ని పొందుతున్నారో, దానికి కొన్ని వేల రెట్లు సుఖాన్ని బాహ్య విషయాలతో సంబంధం లేకుండానే, జ్ఞాని తన హృదయంలో పొందుతున్నాడు.  అందుచేత వాడి ఇంద్రియం కదలదు. స్త్రీ పురుష సంబంధంలో, ఇది చాలా గొప్ప సుఖం అనిపిస్తుంది వాళ్ళకి.  ఆ సుఖం స్త్రీ శరీరం పురుష శరీరం తాకటం వల్ల రావటం లేదు, ఈ స్త్రీ శరీరం పురుష శరీరం తాకటం వల్ల ఇతర తలంపులు పోయి ఆ తలంపు ఒక్కటే నిలబడుతుంది.  ఇతర తలంపులు పోయి ఒక్కటే తలంపు ఎప్పుడైతే నిలబడిందో అప్పుడు ఏకాగ్రత వస్తుంది.  అప్పుడు వీడి హృదయంలో ఉన్న సుఖం ఆ ఏకాగ్రతలోంచి వస్తోంది కానీ, శరీరాల వల్ల రావటం లేదు.  అది కూడా మీరు గమనించండి.  ఏకాగ్రత ఎప్పుడు వస్తుంది అంటే, ఇతర తలంపులు అన్నీ పోయి ఒకే

తలంపు మీద మీ మనస్సు నిలబడినప్పుడు ఏకాగ్రత వస్తుంది. ఆ ఏకాగ్రత వచ్చినప్పుడు మీ హృదయంలో ఉన్న శాంతే మీ హృదయంలో ఉన్న సుఖమే మీకు వస్తోంది కానీ ఆ సుఖం, శాంతి మీ శరీరంలోంచి రావటంలేదు.

మామూలుగా బాహ్యంగా వివాహము విషయంలో, భగవాన్‌తో ఎవరైనా వివాహం చేసుకున్నారు అని అంటే సరి సరి అనేవారు. కానీ రామకృష్ణ పరమహంసగారు ఎవరైనా వివాహం చేసుకున్నారు అంటే చెవులు మూసుకునేవారు. వాడికి అవకాశాలు పోతున్నాయి అని. అంతమాత్రంచేత వాడు పాడైపోయాడు, చెడిపోతాడు అని కాదు రామకృష్ణ పరమహంస గారి ఉద్దేశం. వాడి కాలం సంసారానికి ఖర్చు అయిపోతుంది. అర్ధరూపాయి వాటానో ముప్పావలా వాటానో వాడి సంసారానికి వెళ్ళిపోతుంది, ఇంకో పావలా వాటా ఉంటే వాడు బ్రహ్మస్వరూపం మీద ఏం పెట్టగలడు అని ఆయన ఉద్దేశం. మీకు ఏ మిల్లులోనో పది పైసల వాటా ఉందనుకోండి, ఏమొస్తుంది పది పైసలకి. ఒకవేళ వచ్చినా ఏదో సంసారానికి వెళ్ళిపోతుంది. తక్కువ వాటా మీద నిల్వ వేసుకోవటానికి వుండదు. రామకృష్ణ పరమహంసగారి ఉద్దేశం ఏమిటంటే, వివాహం చేసుకుంటే, తన మనస్సు యొక్క శక్తి అంతా ఇంద్రియాల మీదికి వెళ్ళిపోతుంది సంసారం గొడవలో పడి పోతుంది. ఇంక పరబ్రహ్మకి అర్పించటానికి అసలు ఏమీ ఉండదు. తరువాత ఇందులో రహస్యం ఏమిటంటే ఎటాచ్‌మెంట్ వస్తుంది. ఎప్పడైతే వివాహం అయ్యిందో వాడికి వెంటనే మోహం కలుగుతుంది. ఈ మోహం కలిగిన వాడు తప్పనిసరిగా పాపం చేస్తాడు. మహాత్మాగాంధీగారు ఏం చెప్పారంటే, పెళ్ళిళ్ళు చేసుకొని దేశసేవలోకి రావటంకంటే, పెళ్ళి అవ్వకుండా ఉన్న వాళ్ళు దేశసేవలోకి దిగితే దేశం ఏమైనా కొంచెం బాగుపడుతుంది అన్నారు. దేవుడి దాకా వెళ్ళొద్దు, దేశసేవ చెయ్యాలన్నా వివాహం చేసుకున్న వాళ్ళ కంటే వివాహం చేసుకోకుండా ఉన్నవాళు దేశానికి ఎక్కువగా ఉపయోగపడగలుగుతారు అని గాంధీగారు ఆయన వ్యక్తిగత అభిప్రాయం చెప్పారు. అంటే ఏమిటి? పెళ్ళి అయిన వాడికి ఎలాగైనా తన మనస్సు ఎక్కువ సంసారం మీదకి వస్తుంది. ఈ దేశంలోంచి మన సంసారానికి ఎంతవరకూ పిండుకుందాం అని చూస్తాడు కానీ, సంసారికి జనరల్‌గా మనం దేశానికి ఏమిస్తున్నాం అన్న ఆలోచన తక్కువగా ఉంటుంది అని గాంధీగారి అభిప్రాయం.

నిరంతరము పరబ్రహ్మము యందు రమించేవాడు బ్రహ్మచారి. మీరు నిరంతరమూ పరబ్రహ్మము యందు రమించగలుగుతూవుంటే మీరు కూడా బ్రహ్మచర్యంలో ఉన్నట్టే. బాహ్యప్రపంచం దేనికి? అది సహాయకారి మాత్రమే. మిత నిద్ర, మిత ఆహారము, మిత భాషణ ఏవిధంగా అయితే సహాయకారులో అదేవిధంగా బాహ్యమైన బ్రహ్మచర్యం కూడా సహాయకారి మాత్రమే. బ్రహ్మచర్యానికి ఆత్మకి ఎట్టి సంబంధం లేదు. ప్రకృతికి ఆత్మకి ఎట్టి సంబంధం లేదు. ఈ శరీరానికి ఆత్మకి ఎట్టి సంబంధం లేదు. ఈ మనస్సుకి ఆత్మకి ఎట్టి

సంబంధం లేదు. మీ అహంకారానికి ఆత్మకి ఎట్టి సంబంధం లేదు. అసలు మీకు కనిపిస్తున్నటువంటి, ఇంద్రియాలకి గోచరిస్తున్నటువంటి, ఈ లోకానికి కానీ శోకానికి కానీ ఈ ఆత్మకి ఎట్టి సంబంధం లేనే లేదు. ఆత్మ హేతువాదానికి అతీతం అయ్యి ఉండవచ్చు కానీ హేతువాదానికి విరుద్ధం మటుకు కాదు. ఆత్మ రీజనుకి అతీతమైనది, అంతమాత్రంచేత అది రీజనుకి విరుద్ధమైనది కాదు. ఈ మధ్యన కొంతమంది ప్రారబ్ధమా లేకపోతే కర్మా అని వీటి గురించి చర్చిస్తున్నారు. ప్రారబ్ధం అంటే ఎలా ఉంటుంది, కర్మ ఎలా ఉంటుందని చాలామంది పుస్తకాలు చదువుకొని చర్చిస్తుంటారు. అసలు రాసేవాడికి కొంత అనుభవం ఉండాలి, రాసినవాడికే తెలియనప్పుడు చదివేవాడికి ఏం తెలుస్తుంది! భగవంతుడు మీరు ఈ శరీరం అని చెప్పాడా? మనస్సు అని చెప్పాడా? ఆత్మ అని చెప్పాడా? ఈవిడ పేరు అన్నపూర్ణ. అన్నపూర్ణ అంటే ఎవరు అనుకొంటోంది - ఈ శరీరం మనస్సు కలిసి అన్నపూర్ణ. అయితే భగవంతుడు ఈ శరీరము మనస్సు నువ్వు అని చెప్పటం లేదు, ఆత్మ నువ్వు అని చెపుతున్నాడు. మనము ఈ శరీరము మనస్సు నేను అనుకొంటున్నాము. శరీరము మనస్సు నేను అనుకొనేవాడికి ప్రారబ్ధమూ కర్మా కానీ, ఆత్మకి కర్మ ఏంటి ప్రారబ్ధమేంటి అసలు? ఎవడు అనుభవించేది కర్మ? వాడు కర్మ అనుభవిస్తున్నాడు అండీ, లేకపోతే ఆ అమ్మగారు కర్మ అనుభవిస్తున్నారు అని అలా అంటారు. కర్మ అనుభవిస్తున్నారు అంటే శరీరం అనుభవిస్తోందనా, అక్కడ మనస్సు అనుభవిస్తోందనా? శరీరము మనస్సు అతను కాదు, ఇంక అనుభవించేది ఎవరు? ఆత్మ అనుభవిస్తుందా కర్మ? అసలు ఎప్పుడైనా అది చేస్తే కదా కర్మ! చేసినవాడు కర్మ అనుభవిస్తాడు, రైటే! ఆత్మ ఎప్పుడైనా కర్మ చేసిందా? సూర్యుడు ప్రకాశిస్తున్నాడు - మంచి పనులు చేసేవాళ్ళు ఉన్నారు, చెడ్డ పనులు చేసే వాళ్ళు ఉన్నారు - మంచి పనులు చేసేవాళ్ళతో మీరు మంచి పనులు చెయ్యమని, చెడ్డ పనులు చేసేవాళ్ళతో మీరు చెడ్డపనులు చెయ్యమని సూర్యుడు చెప్పటంలేదు. పైగా ఈ మంచి పనులు చెడ్డ పనులు సూర్యుడికి ఏమైనా తగులుతున్నాయా? ఆకాశంలో సూర్యుడు ఏవిధంగా అయితే ప్రకాశిస్తున్నాడో మీలో ఆత్మ అలా ప్రకాశిస్తోంది, మీరు చేసే కర్మలు సూర్యుడికి ఏమైనా అంటుతున్నాయా? అంటటం లేదు. సూర్యుడికే అంటనప్పుడు మీ ఆత్మకి ఎలా అంటుతాయి? సూర్యుడు జడ వస్తువు, మీ హృదయంలో ఉన్న ఆత్మ చైతన్య వస్తువు. ఇప్పుడు మీరు ఆత్మ అని చెప్పారు, మరి ఈ ప్రారబ్ధం కర్మ ఎవరికి? ఈ విషయం, ఈ క్లూలు మీరు అర్థం చేసుకోకుండా ఎన్ని వేల సార్లు మీరు పుస్తకాలు చదివినా, ఎన్నిసార్లు సత్సంగాలు చేసినప్పటికీ మీకు విడివడదది. కాళ్ళు చేతులు కదపక్కరలేకుండా చీమ కుట్టినంత బాధ కూడా లేకుండా ప్రకృతిలోంచి మాయలోంచి విడివడవచ్చు మీరు విషయాన్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేస్తే, మంచి కర్మ చేస్తే. మంచి ప్రారబ్ధం, చెడ్డ కర్మ చేస్తే చెడ్డ ప్రారబ్ధం వస్తుంది. రైటే! మంచి ప్రారబ్ధం అవ్వచ్చు చెడ్డ ప్రారబ్ధం అవ్వచ్చు వేరే విషయం అది. ఎవరు చేసారు.

పూర్వజన్మలలోనో ఈ జన్మలోనో గతంలో చేసారనుకోండి, ఎవరు చేసారు? మీలో ఉన్న ఆత్మ చేసిందా, మీ శరీరం చేసిందా, మీ మనస్సు చేసిందా? మీ మనస్సు మీ శరీరం కలిసి చేసాయి. ఆత్మకి కర్మతోటి ఎట్టి సంబంధం లేదు. ఆత్మకి కర్మతోటి సంబంధం లేనప్పుడు, ఆత్మకి ప్రారబ్ధం ఏముంటుంది? అయితే మీరు ఆత్మ అని చెపుతున్నాడా భగవంతుడు, ఈ శరీరం మీరు మనస్సు మీరు అని చెప్పుతున్నాడా? మీరు ఆత్మ అయినప్పుడు ఈ ప్రారబ్ధం తోటి ఈ కర్మతోటి మీకు సంబంధం ఏంటి అసలు? ఆత్మ దర్శనం అయిన రోజున ప్రారబ్ధానికి మీరు కదలక్కరలేదు. ప్రారబ్ధము, కర్మ అనేది ఇక్కడ మనస్సు లెవెల్‌లో దేహం లెవెల్‌లో ఆగిపోతుంది. ఎందుకంటే చేసినవి ఆ రెండే కాబట్టి. మీకు ఎప్పుడైతే ఆత్మ దర్శనం అయ్యిందో, నేను బాగుచెయ్యాలి వీళ్ళందరినీ అని వాడు అనుకోనక్కరలేదు. ఎందుచేతనంటే అది కూడా బంధం, అది కూడా సంకల్పం. ఇప్పుడు మీరు దీపం వెలిగించారనుకోండి ఇక్కడ, వీళ్ళందరికీ వెలుగు ఇవ్వాలి అని దీపం అనుకోనక్కరలేదు. అది అనుకోనక్కర లేకుండానే వెలుతురు వస్తుంది. సూర్యుడు ప్రకాశిస్తున్నాడు అనుకోండి, ఈ లోకానికి అంతటికీ వెలుగు ఇవ్వాలి అని సూర్యుడు అనుకోడు. అనుకోనక్కరలేకుండానే సహజంగానే సూర్యుడు ఉదయించేసరికి వెలుతురు వస్తుంది. అలాగే ఎవడికైతే జ్ఞానం కలిగిందో, తన దేహాన్ని మనస్సుని దాటి, ఎవడైతే తనలో సత్యవస్తువుని దర్శించాడో సహజంగా వాడివల్ల లోకానికి వెలుతురు వస్తుంది, వాడి వల్ల లోకం ఉద్ధరించబడుతుంది. అంతేకానీ ఈ లోకాన్ని నేను ఉద్ధరించాలి అని అనుకోడు వాడు. ఎందుచేతనంటే అనుకుంటే అది కూడా అజ్ఞానం అది కూడా సంకల్పం. పూర్వజన్మలలో మీరు దేహంతోటి, ఇంద్రియాలతోటి, మనస్సుతోటి మీరు చేసిన చెడ్డ ప్రారబ్ధం ఉండవచ్చు, మంచి ప్రారబ్ధం ఉండవచ్చు - కాలగర్భంలో మీరు చెడ్డ చేస్తే చెడ్డ ఎదురు రావచ్చు మంచి చేస్తే మంచి ప్రారబ్ధం రావచ్చు. చేసిందే ఎదురు వస్తుంది కదా! చెడ్డ ప్రారబ్ధం అయితే చెడ్డ ఎదురు వస్తుంది పోనీ మంచి ప్రారబ్ధం అయితే మంచి ఎదురు వస్తుంది. ఈ రెండూ మీరుకాదు, ఎందుచేతనంటే చెడ్డ ప్రారబ్ధమూ మీరు కాదు, మంచి ప్రారబ్ధమూ మీరు కాదు, ఈ మనస్సూ మీరు కాదు, మీ ఇంద్రియాలూ మీరు కాదు, మీ దేహమూ మీరు కాదు, మీ అహంకారమూ మీరు కాదు - మీరు ఆత్మ! ఆత్మకి వీటికీ ఎట్టి సంబంధం లేదు. వీటితోటి సంబంధం పెట్టుకుంటే మీకు సంసారం తప్పదు, ఇంద్రియాలు నేను, దేహం నేను, ఈ మనస్సు నేను అనుకొని వీటిని విడిచిపెట్టకుండా మీరు ఎన్ని గ్రంథాలు చదివినా, ఆహారం మానేసి అడవులలో తలక్రిందులుగా తపస్సులు చేసినా మీకు ఆత్మ దర్శనం అవ్వదు అవ్వదు! స్త్రీలు అవ్వనివ్వండి, పురుషులు అవ్వనివ్వండి బండతనంగా ఉండే వాళ్ళకి ఇది రానేరాదు అసలు.

ఉదాహరణకి ఎవరైనా మిమ్మల్ని విమర్శించారనుకోండి మీకు కంగారు పుట్టొచ్చు, ఎవరైనా మిమ్మల్ని పొగిడారనుకోండి మీకు సంతోషం రావచ్చు. ఇదంతా మీ అహంకారానికే,

ఆత్మకి దీనితో ఎట్టి సంబంధం లేదు. అంటే ఏమిటి? మీ అహంకారం మీరు అనుకొంటున్నారు కాబట్టి అది కదులుతోంది, మీలో కనుక అపవిత్రత లేకపోతే, ఎవరు ఏమనుకొన్నా మీరు కదలనక్కరలేదు, ఎందుచేతనంటే లోపల కదిలేది ఏమీ లేదు. ఎవరైనా ఒకమాట అన్నారంటే, ఎవరైనా మిమ్మల్ని విమర్శిస్తే మీ లోపల ఉన్న అపవిత్రతే మిమ్మల్ని కదిలిస్తోంది. కొరత ఉంది కాబట్టి నాకు వైకుంఠం కావాలనో, కైలాసం కావాలనో, ఇంకా గొప్ప జన్మ రావాలనో కోరుకొంటున్నారు. మీలో ఏమీ కొరత లేదనుకోండి, మీరు పరిపూర్ణమైన సుఖంగా ఉన్నారనుకోండి మీకు వైకుంఠంతోటి పనేముంది, కైలాసంతోటి పనేముంది చెప్పండి.

మీకు దేవుడంటే ఎక్కువ ఇష్టమా? మీరంటే మీకు ఎక్కువ ఇష్టమా? నాకు నేనే ఎక్కువ ఇష్టం. అందరికంటే నేనుని ఎక్కువ ప్రేమించుకొంటున్నాను, దేవుడిని ఎందుకు ప్రార్థిస్తున్నానంటే నాకు ఏమైనా ఉపకారం చేస్తాడేమో అని ప్రార్థిస్తున్నాను. అంటే నేను ముఖ్యం. నేను వేంకటేశ్వరస్వామి దగ్గరకి వెళ్తున్నాను, అరుణాచలం వెళ్తున్నాను, పూజలు జపాలు చేస్తున్నాను - ఇవన్నీ ఎందుకు చేస్తున్నాను, కాలక్షేపానికి చేస్తున్నానా? నన్ను నేను ప్రేమించుకొంటున్నాను కాబట్టి, నాకు ఏమైనా ఉపకారం చేస్తాడేమో అని నేను ఇవి అన్నీ చేస్తున్నాను. అంటే ఏంటి? మీకు దేవుడికంటే నేనే ఎక్కువ? వేంకటేశ్వరస్వామి దగ్గరకి మీరందరూ కాలక్షేపానికి వెళ్తున్నారా? డబ్బులు చెల్లక వెళ్తున్నారా మీరు? మీకేమైనా ఉపకారాలు చేస్తాడేమోనని వెళ్తున్నారు. మీరు అనుకొంటున్నారు దేవుడిని ప్రేమిస్తున్నానని, కానీ మిమ్మల్ని మీరే ప్రేమించుకొంటున్నారు. పిల్లి చూడండి తనను తానే ప్రేమించుకొంటుంది. పాము చూడండి, మనం విష జంతువు అనుకుంటాము, కానీ దాని శరీరం అంటే దానికి ఎంతో ఇష్టం. తనని తాను ప్రేమించుకొంటుంది. పులి చూడండి తనని తాను ప్రేమించుకొంటుంది. లోకంలో అనేకమంది మనుషులు ఉన్నారు. వాళ్ళమీద వాళ్ళకి ప్రేమ లేనివాళ్ళని ఎవరినైనా చూసారా? మీకోసం మీ ఇంట్లో వాళ్ళని ప్రేమిస్తున్నారు, ఏదో నాలుగు రూపాయలు సంపాదించి ఇంటివద్ద పారేస్తున్నారు కాబట్టి వాళ్ళని ప్రేమిస్తున్నారు. మీకోసం వాళ్ళని ప్రేమిస్తున్నారు మీరు. కానీ మీకు అనిపిస్తుంది ఊరికే వాళ్ళని ప్రేమిస్తున్నామని. వాళ్ళు సంపాదన మానేసారు అనుకోండి మీకు ప్రేమా తగ్గిపోతుంది. అంటే అప్పుడు కూడా మిమ్మల్ని మీరే ఎక్కువ ప్రేమించుకొంటున్నారు. కొంతసేపు పుస్తకాలన్నీ ఒక ప్రక్కన పెట్టండి. మీ అనుభవానికి విరుద్ధంగా మీ అనుభవానికి వ్యతిరేకంగా నేనేమైనా చెప్తున్నానా? కొంతసేపు మతాలూ దేవుళ్ళూ ఇవన్నీ ఒక పక్కన పెట్టండి. మీ అనుభవానికి విరుద్ధంగా నేను ఒక్క మాట చెపుతున్నానా? అంటే మిమ్మల్ని మీరే ప్రేమించుకొంటున్నారు. ఎందుచేత? ఉన్నది మీరు ఒక్కరే, మీరు ఆత్మ. నిజమైనది "నేనే" - దేవుడు అబద్ధం నేను నిజం. ఎందుచేత - నిద్రలో కూడా నేను ఉన్నాను కానీ నాకు దేవుడి గొడవ లేదు. నాకు దేవుడి గొడవ ఇప్పుడు ఉంది, గాఢనిద్రలో నాకు దేవుడి గొడవ ఏమైనా ఉందా? ఏమీ లేదు, కానీ అక్కడ కూడా

నేను ఉన్నాను, దేవుడి గొడవ, ప్రపంచం గొడవ, నా స్నేహితులు విరోధులు గొడవ లేనప్పుడు, నా సంసారం గొడవ లేనప్పుడు, నా విద్య గొడవ నా ధనం గొడవ లేనప్పుడు, హాయిగా నేను నిద్రలో ఉన్నాను, అప్పుడు నాకు దేవుడి గొడవ ఏమీ లేదు, కానీ నేను ఉన్నాను. అప్పుడు నాకు చావు గొడవ లేదు, చావు అంటే భయం ఏమీ లేదు. నిద్రలో హాయిగా ఉన్నాను, అక్కడ నేను ఉన్నాను కానీ అప్పుడు దేవుడి సమస్య లేదు, లోకం సమస్య లేదు, శోకం సమస్య లేదు. మీకందరికీ అప్పుడప్పుడూ భయం వేస్తోంది, మరి నిద్రలో భయం ఎందుకు వెయ్యటంలేదు? నిద్రలో మీ దేహం గురించి మీకు తెలియదు. దేహం జ్ఞాపకం వచ్చాక భయం ప్రారంభమవుతుంది. మీకు నిద్రలో ఎవరికైనా భయం వేస్తోందా? ఎవరికీ భయం ఉండదు. ఎందుచేత - నిద్రలో మీకు రెండో వస్తువు లేదు, రెండో వస్తువు కనిపించేసరికి భయం వస్తుంది. నిద్రలో మీరు ఒక్కరే ఉన్నారు, ఇంకెవ్వరూ లేరు అక్కడ. అంటే రెండో వస్తువు లేదు కాబట్టి మీకు భయం వెయ్యదు.

మీకు మెలకువ వచ్చేసరికి, ఈ దేహం నాది అని మొట్టమొదటి తలంపు వస్తుంది. పొద్దున్న లేవగానే చూసుకోండి, ఐదు గంటలకి లేస్తారా? ఐదు గంటలకి లేవగానే చూసుకోండి, మీకు దేవుడి గొడవ రాదు, ఈ దేహం నాది అని వస్తుంది. మీరు ఎప్పుడు లేచినా మీకు మొట్టమొదటి తలంపు ఏది వస్తోందో చూసుకోండి. మీరు సాయంత్రం మంచం ఎక్కాక నిద్రలోకి వెళ్ళే ఆ సెకను మనకి తెలియదు. మళ్ళీ నిద్రలోంచి మెలకువ వస్తుంది, ఆ సెకనూ తెలియదు. అలాగే మనం చనిపోయినప్పుడు కూడా ఆ సెకను మనకి తెలియదు. ప్రాణం పోయినప్పుడు, బయటివాడు అనుకుంటాడు వీడు పోయాడని, కానీ ప్రాణం పోయేసెకను కూడా మనకి తెలియదు. నిద్ర వచ్చే సెకను తెలియదు. తరువాత రేపు తెల్లవారుఝామున మీరు చూడండి, నిద్రలోంచి జాగ్రదావస్థలోకి వచ్చినప్పుడు మొట్టమొదట వచ్చే తలంపు దేహాన్ని నేను. ముందు దేహభావన వచ్చిన తరువాత ఈ దేహానికి సంబంధించిన భావనలన్నీ చుట్టుకుంటాయి. నిద్రలో మీరు దేహం గొడవ లేకుండా ఉంటున్నారు కదా! మరి చావు అంటే మీకు ఎందుకు భయం వేస్తోంది? చచ్చిపోయిన వాడికి దేహం ఉండదు కదా! దేహాన్ని కాల్చేస్తారు కదా! నిద్రలో తన దేహంతో సంబంధం లేకుండా తను ఉంటున్నాడు, అప్పుడు భయం వెయ్యటం లేదు. కానీ చావు అంటే వీడికి ఎందుకు భయం వేస్తోంది? అంటే వీడు నిద్రపోయే ముందు ఏమనుకొంటున్నాడంటే, రేపు పొద్దున్న మళ్ళీ లేస్తాము కదా అనుకొంటున్నాడు, రేపు పొద్దున్న లేచిన తరువాత ఈ దేహం కనిపిస్తుంది అనే తలంపు ఉంది కదా! చావు అంటే ఈ దేహం ఇంకసలు కనబడదు కదా! అందుచేత వీడికి భయం వస్తుంది.

ఆచార్యులువారు ఏమని చెపుతున్నారు అంటే పూజలు చెయ్యండి జపాలు చెయ్యండి బ్రహ్మచర్యం అవలంభించండి, వీటన్నిటి వల్ల ఒక్కటే ప్రయోజనం - దేవుడిని తెలుసుకోవడానికి

ఇవన్నీ చేస్తున్నామని మీరు అనుకోవచ్చు. దానికి ఆక్షేపణ లేదు, కానీ అది పెద్ద అబద్ధం. మిమ్మల్ని మీరు పరిశుద్ధం చేసుకోవటం కోసం ఇవన్నీ చేస్తున్నారు. అది మీకు తెలియదు. మీరు ఎక్కువ పవిత్రులు అవ్వటంకోసం, మీలో దోషాలు ఏమైనా ఉంటే వాటిని బయటికి గెంటటం కోసం ఈ పూజలని, జపాలనీ చేస్తున్నారు. మనిషి పవిత్రుడు అవ్వటంకోసమే ఇవన్నీ చేస్తున్నాడు. తీర్థయాత్రలు కూడా అంతే. ఎందుచేతనంటే, వస్తువు ఇక్కడ ప్రత్యక్షంగానే ఉంది. నేను మిమ్మల్ని ఎలా చూస్తున్నానో అలా ఆ అనుభవం వచ్చిన వాళ్ళకి స్పష్టంగా తెలుస్తూ ఉంటుంది. దానికి రుజువులు సాక్ష్యాలు అక్కరలేదు. భగవంతుడు మీ హృదయంలో ఆత్మరూపంలో ప్రకాశిస్తున్నాను అని చెప్పాడు. అది మీకు అనుభవం వచ్చినప్పుడు ప్రత్యక్షంగా తెలుస్తూ ఉంటుంది. మీరు పుస్తకాలు చదవనక్కరలేదు, రుజువులు సాక్ష్యాలకి వెళ్ళనక్కరలేదు, కోర్టులకు వెళ్ళనక్కరలేదు, ఆ దర్శనం అవునా కాదా అని మీకు అనుమానం కూడా పుట్టదు. తెలియనప్పుడు భయం వేస్తుంది, తెలిసినప్పుడు భయం ఉండదు, ఒకలెక్క ఉందనుకోండి అది తెలియనప్పుడు నాకు వెంటనే భయం పుడుతుంది, తెలిసున్నప్పుడు నాకేమీ భయం పుట్టదు. ఏ విషయమైనా అనుమానం వల్ల నాకు భయం వేస్తుంది, తెలిసుంటే భయం వెయ్యదు.

నేను ఈ చొక్కా తొడుక్కున్న మాట నిజమే, అయితే ఈ చొక్కానా నేను? ఈ దేహం ఒకటి నాకు ఉన్నమాట నిజమే, అయితే ఈ దేహాన్నా నేను, ఎన్ని పనులు చేసినా మీ కోసమే మీరు చేసుకొంటున్నారు. ఈ దేవుళ్ళూ ఇవన్నీ కల్పితం. జ్ఞాపకం ఉంచుకోండి, దేవుడు అనేవాడు ఒకడు లేడు. నేను ఇలా చెపుతున్నానని మీరేమీ కంగారుపడకండి. మీరు కట్టుకున్న పందిరిని కూల్చేయటం నా పని కాదు. మీ మనస్సుతోటి మీ ఊహలతోటి మీరు ఏవో గూళ్ళు కట్టుకొంటున్నారు. ఆ గూళ్ళు ఊడగొట్టేయటమేనా నా పని? మీ మనస్సుతో చక్కగా అలంకరించుకొని, మనస్సుతోటి కొన్ని ఆధారాలు పెట్టుకొంటున్నారు? ఆ ఆధారాలు పడగొట్టేయమంటారా నన్ను. మీ మనస్సుతో కొన్ని విషయాలు నమ్ముతున్నారు, నమ్మి వాటితో బాగా అలంకరించుకొంటున్నారు. కానీ ఏదో ఒక రోజున అవి అన్నీ కూలిపోవటం తప్పదు, అవి అబద్ధం కాబట్టి, నేను కూడా అబద్ధమే, ఎలాగంటే - మెహర్‌బాబా ఉన్నారు, సత్యసాయిబాబా ఉన్నారు, లేకపోతే రాముడు ఉన్నాడు, కృష్ణుడు ఉన్నాడు, రమణమహర్షి ఉన్నాడు - జాగ్రత్తగా వినండి. మీకేమీ తొందరవద్దు, మీరు జాగ్రత్తగా వినండి. రమణమహర్షి మనకి గురువు అనుకొంటున్నాము, అంటే ఆ శరీరం గురువా? లేకపోతే కృష్ణుడు మన గురువు అనుకొంటున్నాము, కృష్ణుడి శరీరం మన గురువా? రాముడు మనకి గురువు అనుకొంటున్నాము రాముడి శరీరం గురువా? ఆ శరీరానికి జ్ఞానం ఇచ్చే శక్తి ఉందా? కాదండీ రమణమహర్షికి శరీరం ఉంది, కృష్ణుడికి శరీరం ఉంది, మన శరీరాలు ఎలా ఉన్నాయో అలా ఆ శరీరాలూ ఉన్నాయి. నన్ను సూది పెట్టి పొడవండి, రక్తం వస్తుంది. అలాగే రాముడ్ని సూది పుచ్చుకొని పొడవండి, రక్తం వస్తుంది. రమణమహర్షిని

సూది పుచ్చుకొని పొడవండి, రక్తం వస్తుంది. మన శరీరంలో ఏముందో ఆ శరీరంలోనూ అదే ఉంది. అయితే ఈ శరీరమా గురువు అంటే? రాముడు దేవుడు అంటే, రాముడి దేహం దేవుడా? లేకపోతే కృష్ణుడు దేవుడు అంటే, కృష్ణుడి దేహం దేవుడా? మరి కృష్ణుడి దేహం నిజమైతే ఇప్పుడు ఆ దేహం ఎందుకు లేదు? రాముడి దేహం నిజమైతే ఇప్పుడు ఎందుకు లేదు? మీరు ఆలోచించండి. రమణుడు దేహమే నిజం అనుకొందాము, అదే గురువు అనుకొందాం. ఆ దేహమా మనకి జ్ఞానాన్ని ఇచ్చేది? నిజమైన గురువు ఎవరో చెప్పమంటారా? నిజమైన గురువు ఎవరంటే మీలో ఉన్న నిజమైన ఆత్మే మీకు నిజమైన గురువు. అయితే పెద్దలైన ఈ రమణస్వామి కానీ రామకృష్ణుడు కానీ, వీళ్ళందరూ చేసే సహకారం ఏమిటంటే మిమ్మల్ని మీకు పట్టి ఇవ్వటం కోసం వాళ్ళు చేసే ప్రయత్నం. మీ హృదయంలో ప్రకాశిస్తున్న ఆత్మ ఒక్కటే నిజమైన గురువు. అయితే బాహ్య గురువు అవసరం లేదా? బాహ్యగురువులు అబద్ధం అయినప్పటికీ అవసరమే. ఎందుచేత వాళ్ళు అవసరం? మన మనస్సుని అంతర్ముఖం చెయ్యటానికి వాళ్ళు సహాయపడతారు. ఇప్పుడు మనం ఏమనుకొంటున్నాము - ఈ దేహం నేను అనుకొంటున్నాము. ఈ దేహానికి మనం పరిమితం అయిపోయాము. అందుచేత ఈ దేహం నాది అనుకొంటున్నాము కాబట్టి, రమణుడు అంటే ఆ దేహమే రమణుడు అనుకొంటున్నాము. ఈ దేహం నాది అనుకొంటున్నాను, కృష్ణుడు అంటే ఆ దేహమే కృష్ణుడు అనుకొంటున్నాను. అంటే ఏంటి? మన అజ్ఞానం అక్కడ కల్పిస్తుంది. రమణస్వామి నిజంగా దేహం అనుకొందాము, మరి ఆ దేహం ఇప్పుడు లేదు కదా! అయితే రమణస్వామి లేనట్టేనా?

కృష్ణుడిని ప్రార్థించి అనేక మంది తరించారు. కృష్ణుడు అంటే ఆ దేహమైతే, ఆ దేహము ఇప్పుడు లేదు కదా? మరి ఎలా తరించగలుగుతున్నారు? ఏది వచ్చినా మీ లోపలి నుంచే వస్తోంది? మీ ఆత్మ లోంచి వస్తోంది. లోపల ఉన్న ఆ నిజమైన ఆత్మ శక్తి లేకుండా లేదు. మీకు ఏది వచ్చినా లోపలి నుంచే వస్తోంది. అంటే నిజమైన గురువు ఎవరంటే మీలో ప్రకాశిస్తున్న ఆత్మ నిజమైన గురువు. మనుషులు అందరూ తమ దేహాలను వాళ్ళే అనుకొంటున్నారు, నేను కూడా దేహమాత్రుడిని అని నన్ను అవమానపరుస్తున్నారు అని పరమాత్మ గీతలో చెప్పాడు. నన్ను దేహంగా భావించి మనుషులు అందరూ నన్ను అవమానపరుస్తున్నారు అన్నాడు కృష్ణుడు. అంటే భగవంతుడిని ఒక దేహానికి పరిమితం చెయ్యటం వాడిని అవమానపరచటం. మనం దేహానికి పరిమితం అయ్యి ఉన్నాము కాబట్టి భగవంతుడిని దేహానికి పరిమితం చేస్తున్నాము. మీరు ఈ దేహం కాదు, మనస్సు కాదు, ఇంద్రియాలు కాదు, మీరు ఆత్మ అని చెప్పాడు భగవంతుడు. మీరు ఆత్మ అన్న సంగతి మీకు తెలియబడకుండా మీకు ఎవరు అడ్డువస్తున్నారు? మీ అత్తగారు ఏమైనా అడ్డు వస్తున్నారా? రమణస్వామి మహిమలు చెయ్యలేదు ఏంటి, చచ్చిపోయిన వాళ్ళను బ్రతికించలేదేంటి,

చావు గురించి పుట్టుక గురించి కర్మ గురించి, ఇటువంటివి ఏమీ చెప్పలేదేంటి? ఒక ఆత్మ గురించే చెప్పాడేంటి అని మీలో ఎవరైనా చాటు చాటున చెవులు కొరుక్కోవచ్చు. అవన్నీ బహుస్వల్ప విషయాలు. ఈ దేహమే అబద్ధం ఈ శవం అబద్ధం అంటే మళ్లీ వచ్చే శవం గురించి తెలుసుకోవాలా? మిమ్మల్ని బాగుచెయ్యటమా గురువు చెయ్యవలసిన పని, చచ్చిపోయిన తరువాత మీరేమౌతారో చెప్పటమా? ఆ గురువా ఈ గురువా మీకు కావలసింది? మీరు చచ్చిపోయిన తరువాత ఏమవుతారో చెప్పే గురువు కావాలా మీకు, లేకపోతే ఇప్పడు మీరు జీవించి ఉండగా ఈ శరీరంలో ఉండగా, మీలో ఉన్న అజ్ఞానాన్ని బయటికి తీసే గురువు కావాలా? అసలు మీకు ఏది కావాలో మీకు తెలియనప్పుడు, గురువు విలువ మీకేం తెలుస్తుంది? ప్రార్థన చెయ్యమన్నారు, వ్రతాలు చెయ్యమన్నారు, ఇవన్నీ ఎందుకు చెయ్యమన్నారు? వీటి ప్రయోజనం ఏంటి? నేను ఆత్మ అయినప్పటికీ, నాలో ఉన్న అపవిత్రత వల్ల నేను ఆత్మని అని గుర్తించలేకపోతున్నాను. ఈ వ్రతాల వల్ల ఈ జపాల వల్ల సత్సంగాల వల్ల ఆ అపవిత్రత కొంచెం బయటికి వస్తే, నేను ఆత్మని అని తెలుస్తుంది, అందుకే ఈ పూజలు జపాలు!

ఎవరైనా ఇల్లు చూసి, ఇలా వదిలేసారేంటి ఇల్లు శుభ్రం లేకుండా అంటారనుకోండి, శుభ్రత అనేది ఏమైనా మార్టేరు వెళ్లి పాలకొల్లు వెళ్లి కొనుక్కొచ్చి బాగుచేస్తున్నారా? శుభ్రత ఎక్కడన్నా అమ్ముతారా? ఇక్కడ ఉన్న దుమ్ము తీసేస్తే శుభ్రత ఇక్కడే ఉంది! చీపురు పెట్టి అక్కడ దులిపేస్తే చాలు శుభ్రత అక్కడే ఉంది. అంతే కానీ శుభ్రత పాలకొల్లులో కొనుక్కొస్తున్నారా? శుభ్రత ఎప్పడూ ఉంది, పైన దుమ్ము మీరు తీసేస్తున్నారు. అదేవిధంగా ఆత్మ ఎప్పడూ ఉంది మీలో ఉన్న అపవిత్రతని తొలగించాలి. సాధన అనేది చీపురు కట్ట చేసే పనే చేస్తుంది. మనం చేసే సాధనలు అన్నీ చీపురు కట్ట చేసే పని చెయ్యాలి. అంటే మన హృదయంలో ఉన్న పనికిరానిదంతా, మనం కానిదంతా తీసేస్తే అక్కడ ఉన్న వస్తువు ఉన్నట్టుగా ప్రకాశిస్తుంది. బయట ఉన్న దుమ్ము తీసేస్తే, శుభ్రత అక్కడే ఉంది, శుభ్రత శుభ్రతగా కనిపిస్తుంది. మధ్యలో వచ్చిన దుమ్ము తీసేస్తున్నాము. అదేవిధంగా మనం ఎప్పడూ ఆత్మగానే ఉన్నాము, మధ్యలో వచ్చిన అజ్ఞానాన్ని తీసేస్తున్నాము. ఆత్మ అక్కడే ఉంది. అంటే చీపురు కట్ట ఎటువంటి పని చేస్తుందో ఈ సాధనలు జపాల పేరు మీద మనం చేసే పని కూడా అదే.

ఇల్లు విడిచిపెట్టేసి ఏ అడివికో వెళ్లిపోతారు, మీకు ఆత్మ తెలుస్తుందా? మీ ఇల్లు ఏం చేసింది, మీ ఇల్లు ఎపుడైనా మిమ్మల్ని ఆత్మని తెలుసుకోవద్దు అని చెప్పిందా? మీరు ఇంటిమీద కోపం వచ్చి అరణ్యానికి వెళ్లిపోతారు, మీ ఇల్లు ఏమైనా మీకు అపకారం చేసిందా, ఆత్మని తెలుసుకోవద్దు అని ఎప్పడైనా చెప్పిందా మీకు? ఊరు మీకు చేసిన అపకారం ఏమిటి? ఇల్లు మీకు చేసిన అపకారం ఏమిటి? ఇవి అపకారం చేస్తూ వుంటే పోనీ వీటిని విడిచిపెట్టేస్తున్నాము అనవచ్చు. అంటే ఇవి అన్నీ మనస్సు చేసే కోతి చేష్టలు. ఈ దేహంలో

ఎలాగా సాగదు, వచ్చే జన్మలో బాగా చేసుకుందాము అనుకుంటారు. ఈ దేహంలో చెయ్యలేనిది వచ్చే జన్మలో ఎలా చేస్తారు? ఈ దేహంలో చెయ్యలేకపోతున్నాము, కష్టం అవుతోంది, వచ్చే జన్మలో చేసుకోవచ్చును అనుకుంటారు - అది కూడా మనస్సు కల్పించే మాయ! మాయ అంటే ఎలా ఉంది? ఇదంతా మాయ అండీ అంటారు. మాయని ఎప్పుడైనా చూసారా మీరు? మాయ అంటే ఏంటో అర్థం అవ్వకుండా, అసలు మాయ అంటే ఏంటో తెలియకుండా మీకు మాయ ఎలా పోతుంది? ఇదంతా మాయ అండీ అంటారు, మాయ అంటే ఏంటి? అది ఉంటే కదా అసలు, అది మీకు కనబడదు. మీ మనస్సే మాయ అని తెలియటానికి ఎన్ని జన్మలు పడుతుందో? ఇంకో వంద జన్మలు ఎత్తితేనే కానీ ఈ విషయం తెలుసుకోరా? ఇప్పుడు చెపితే మీకు అర్థం అవ్వదా లేకపోతే తెలుసుకోరా? మంచి పనులు చెయ్యాలి. మంచి పనులు ఎందుకు చెయ్యాలండీ? మళ్ళీ జన్మ ఇంకా మంచి జన్మ వచ్చేస్తుందనా? అసలు మంచి పనులు ఎందుకు చెయ్యాలి? మనస్సు పవిత్రం చేసుకొని మోక్షం పొందటంకోసం మంచి పనులు చెయ్యాలా లేకపోతే ఇంకా మంచి జన్మలు రావటంకోసం మంచి పనులు చెయ్యాలా?

అహంకారం చాలా సటిల్‌గా ఉంటుంది. మీ అహంకారం చేసే చేష్టలు కనుక మీకు అర్థం కాకపోతే, ఈ దేశాన్నంతా మీరు సిమెంటు రోడ్డులు వేసి కలిపినా మీ లోపల ఉన్న అజ్ఞానం బయటికి రాదు. లోకాన్ని బాగు చెయ్యటానికి మీరెవరు? నేను అనుకొంటాను అనుకోండి, ఈ ఊరిని బాగుచేసెయ్యాలి ఈ దేశాన్నంతా బాగుచేసెయ్యాలి అని, అది నా అహంకార లక్షణమా లేకపోతే జ్ఞాన లక్షణమా? జ్ఞాని అలా అనుకుంటాడా నేను అంతా ఉద్ధరించెయ్యాలని? అలా అనుకుంటే తనకంటే భిన్నంగా లోకం కనిపిస్తోంది కదా! తనకంటే భిన్నంగా లోకం కనిపిస్తుంటే ద్వైతంలో పడ్డాడు కదా! ద్వైతంలో పడితేవాడు జ్ఞాని ఎలా అవుతాడు? మంచి పనులు మీరు కీర్తికోసం చేస్తున్నారా? లేకపోతే పుణ్యం వస్తుందని చేస్తున్నారా? లేకపోతే మీరు పరిశుద్ధం అవ్వటానికి చేస్తున్నారా? కొంతమంది పాలరాయితో గుడులు అవీ కట్టించారు, చాలా చోట్ల రోడ్డులు వేయించారు అయితే వాళ్ళందరికీ జ్ఞానం వచ్చిందా? గొప్ప కార్యాల పేరు మీద సత్కర్మల పేరు మీద మీ అహంకారాన్ని అలంకరించు కుంటారా? అహంకారాన్ని అలంకరించుకుంటే అజ్ఞానం బయటికి ఎలా వస్తుంది? వాడు పవిత్రుడు అయితే మిమ్మల్ని విమర్శించడు. అపవిత్రుడే మిమ్మల్ని విమర్శిస్తాడు, మీకు కంగారు ఎందుకు? భగవద్గీత విమర్శ గ్రంథం కాదు, అది ఉపదేశ గ్రంథం. భగవంతుడు చెప్పింది ఉపదేశం మనకి, అంతేగానీ మనని విమర్శించటానికి చెప్పలేదు. నిజమైన గురువు ఒక్కడే, వాడు మనలో ప్రకాశిస్తున్న ఆత్మ. మీ తల్లితండ్రుల కంటే మీ భర్తలకంటే మీ పిల్లలకంటే మీ మనవల కంటే మీ శ్రేయస్సు కోరేవాళ్ళకంటే, మీ హృదయంలో ఉన్న ఆత్మ మీ కోసం ఎక్కువ ఎదురుచూస్తోంది. మీ ఆత్మ మీ కోసం ఎంత తపిస్తోందో ఒక్కసారి మీ ముఖం అటు

తిప్పారా ఎప్పడైనా? చావు వచ్చేస్తోంది ఎలా బ్రతకాలి అని ఎప్పడూ మీకు ఇదే గొడవ కానీ ఎప్పడైనా మీ హృదయంలో ప్రకాశిస్తున్న ఆత్మ మీ కోసం ఎంత ఎదురు చూస్తోందో ఎంత తపిస్తోందో ఒక్కసారి చూడటానికి మీ మనస్సు ఎప్పడైనా అటు తిప్పారా? చావులు తప్పవు, పుట్టుకలూ తప్పవు. చావులేని వస్తువుని తెలుసుకొనేవరకు చావు తప్పదు. ఆ చావులేని వస్తువు ఇప్పడే ఇక్కడే ఈ శరీరంలోనే ప్రత్యక్షంగా ప్రకాశిస్తోంది. అందుకే భగవంతుడు వాసుదేవస్వామి, ఈ దేహాన్ని స్మరించండి, భగవద్గీతని స్మరించండి అని చెప్పలేదు. మీలో ఆత్మని ధ్యానం చెయ్యండి అన్నాడు. మీలో నిజంగా ప్రకాశిస్తున్న ఆత్మని ధ్యానం చెయ్యండి అని చెప్పాడు. భగవద్గీత పుస్తకాన్ని ధ్యానం చెయ్యండి అని ఎక్కడా భగవంతుడు చెప్పలేదు. ఆత్మ వాటిలో లేదని ఆయనకి తెలుసు. మీ అందరి హృదయాలలో ఆత్మ లేదనుకోండి ఇప్పడు, మీరు సాధన చెయ్యటం వల్లే ఆత్మ తెలుస్తుంది అనుకోండి, అంటే ఇప్పడు లేదు సాధన చెయ్యటం వల్లే కనుక ఆత్మ వస్తే అది అబద్ధం కదా! ఇప్పడు లేనిది కొత్తగా వస్తే నిజం ఎలా అవుతుంది అది? చావులేని వస్తువు హృదయంలో ప్రకాశిస్తుంటే, చనిపోయిన తరువాత ఎక్కడికి వెళ్తాము అని ఈ గొడవ ఎందుకు? ఇదే మాయ. అది ఎంత కనిపెట్టుకొని ఉన్నప్పటికీ అక్కడికి తిరగనివ్వటం లేదు మిమ్మల్ని. అక్కడికి తీసుకెళ్ళటం కోసం ఆ బోధ కోసమే గురువు. గురువు అంటే ఆ శరీరం కాదు!

జరిగిపోయిన గొడవలన్నీ ఏదో కాలంలో జరిగి ఉంటాయి, అవి తలంపు రూపంలో వస్తూ ఉంటాయి, అంటే ఆ కాలమే మళ్ళీ మీలో తలంపుల రూపంలో వస్తోంది. ఎక్కడ రోగాలు లేవో, ఎక్కడ బలహీనతలు లేవో, ఎక్కడ బాధలు లేవో, ఆ వస్తువు మీలో ప్రకాశిస్తున్నప్పడు దాని లోతులు ఎందుకు చూడరు మీరు? పుణ్యం చేస్తే ఇంకా మంచి లోకం వస్తుందని చెపుతూ ఉంటారు. పోనీ ఆ పనులు చేస్తారు, ఆ లోకాలు వస్తాయి, ఆ లోకంలో ఎంతకాలం ఉంటారు మీరు. మనస్సు పలచబడితే జ్ఞానం వస్తుందా, మనస్సు చిక్కబడితే జ్ఞానం వస్తుందా? మనం ప్రతిరోజు చేసేపనుల వల్ల మన మనస్సు పలచబడుతోందా లేకపోతే చిక్కబడుతోందా? మనస్సు చిక్కబడితే జ్ఞానం ఎలా వస్తుంది? మనస్సు పలచబడితే జ్ఞానం వస్తుంది. మరి మనస్సేమో చిక్కబడేలాగా పనులు చేసుకోవటం ఎందుకు? మళ్ళీ సాధనలు చెయ్యాలి సాధనలు చెయ్యాలి అంటూ వెనక్కి తిప్పకోవటం ఎందుకు?

రాగద్వేషాలు వద్దని భగవంతుడు భగవద్గీతలో చెప్పాడు, మీకు ఉన్నాయి, మీకు ఉంటే ఆయనకి నష్టం ఏమిటి అసలు? రాగద్వేషాలు ఉన్న మనిషికి మనస్సు చిక్కబడుతుంది. మనస్సు పెరుగుతూ ఉంటుంది, అంటే అహంకారం పెరుగుతూ ఉంటుంది అందుచేత వద్దని చెప్పాడు. అహంకారం పెరిగే కొలదీ ఆత్మకి దూరం అవుతాము. ఆత్మకి దూరం అవుతున్నామంటే సుఖానికి దూరం అవుతున్నాము, మన స్వరూపానికి మనం దూరం అవుతున్నాము. దేవుడు అక్కరలేదు అని చెప్పేవాళ్ళు చాలామంది ఉన్నారు కాని నాకు సుఖం అక్కరలేదు అని చెప్పే మనిషిని చూసారా ఎక్కడైనా? మన స్వరూపమే

సుఖం. ఆ సుఖాన్ని మీరు పొందినప్పుడు, వైకుంఠం తీసుకొచ్చి మీ చేతిలో పెడితే, ఈ లోకం మాట వదిలేయండి, వైకుంఠం కైలాసం కూడా మీకు గడ్డిపరకతో సమానంగా కనిపిస్తుంది. ఆత్మ దగ్గరకి మిమ్మల్ని తీసుకెళ్ళటానికి ఎవడైతే సహాయం చేస్తాడో వాడే నిజమైన గురువు. ఆత్మని విడిచిపెట్టి మిమ్మల్ని మిగతా గొడవలలోకి తీసుకెళ్తే వాడు గురువు కాదు, వాడు రాక్షసుడు. ఈ గురువుకంటే ఆ గురువు గొప్పవాడు, ఆ గురువుకంటే ఈ గురువు గొప్పవాడు, ఈ దేవుడు కంటే ఆ దేవుడు గొప్పవాడు, ఆ దేవుడు కంటే ఈ దేవుడు గొప్పవాడు, ఇవన్నీ అబద్ధం. ఉన్నది ఒక్కటే అయితే గొప్ప ఏంటి తక్కువ ఏంటి అసలు? రెండు ఉంటే అది గొప్ప ఇది తక్కువ అనవచ్చు. ఉన్నది ఒక్కటే వస్తువు అయితే ఇంక గొప్ప ఏంటి అసలు. రమణమహర్షికంటే రామకృష్ణపరమహంస గొప్పవాడు అనుకుందాం, అంటే ఈ శరీరంకంటే ఆ శరీరం గొప్పదనా? రాముడుకంటే కృష్ణుడు గొప్పవాడు అంటే, రాముడి శరీరం కంటే కృష్ణుడి శరీరం గొప్పదనా? మనం మాట్లాడుకునే మాటలలో అసలు సెన్స్ ఉండాలా? లేనివి కల్పించటం, మళ్ళీ అందులో తేడాలు సృష్టించటం! మళ్ళీ అందులో కంపారిజన్స్! ఈ కంపారిజన్ వల్లే దుఃఖం వస్తోంది మనిషికి. కంపారిజన్ లేకపోతే అసలు మనిషికి దుఃఖంలేదు. ద్వైతం ఉన్నంతకాలం వాడు పాపం చేస్తూనే ఉంటాడు. పాపం నుంచి ఎవడైతే విడుదల కాడో వాడికి జ్ఞానం కలుగదు. మీరు ఆత్మ కాకపోతే దానిని సాధించవచ్చు, మీరు ఆత్మ అని చెపుతున్నాడు కదా ఇంకా దేనిని సాధిస్తారు? మీరు వెతుక్కుంటున్న వస్తువు మీరే అని చెపుతున్నాడు, ఇక మీరు సాధించేది ఏమిటి?

కొంతమంది భోజనం చేసాక కిళ్ళీ నములుతారు. ఆ కిళ్ళీ నమలటం కంటే తేలిక ఇది అర్థం చేసుకోవటం. మీరు అంతర్ముఖం అయితే విషయం మీకు తెలుస్తుంది. చాలామంది గురువులు మనస్సుని బహిర్ముఖం చేసేస్తున్నారు. బహిర్ముఖం అయిన మైండ్ చిక్కబడుతుంది, చిక్కబడిన వెంటనే కన్ఫ్యూజన్ వచ్చేస్తుంది. కన్ఫ్యూజన్ ఎప్పుడైతే వచ్చిందో క్లారిటీ పోతుంది. క్లారిటీ ఎప్పుడైతే పోయిందో మనస్సు ఆత్మవైపు ప్రయాణం చెయ్యనే చెయ్యదు. మీరు చేసే సాధన ఆత్మని గ్రహించటానికా లేకపోతే చనిపోవటానికా? చనిపోవటానికి సాధన ఎందుకు? మనకి ఎలాగూ చావు వస్తుంది కదా! మీరు ఆలోచించకపోతే చావు రాదా? మనం ఏమీ ఆలోచించమనుకోండి చావు గురించి, మనకి చావు ఆగిపోతుందా? మనం ఆలోచించకపోయినా చావు వస్తుంది. దాని గురించి ఎందుకు మనం కాలం పాడుచేసుకోవటం.

దీనిని ఇలా చెప్పకుండా, మీ మనస్సుకి సంతోషం కలిగేలా, దేవుడు అనేవాడు ఒకడు ఉన్నాడు, మీరు మంచి పనులు చెయ్యండి, మీరు మంచి పనులు చేస్తే అది మీ చిట్టాలో రాసి ఉంచుతాడు. రాసి ఉంచితే మళ్ళీ మీకు గొప్ప గొప్ప జన్మలు వస్తాయి - నేను ఇలా చెప్పాననుకోండి మీకు ఎంతో బాగుంటుంది. ఎందుచేతనంటే మన మనస్సు అబద్ధం కాబట్టి దీనికి ఎంతసేపు అబద్ధం కావాలి. మీ లోపల ఉన్న మనస్సు అబద్ధం నా లోపల

ఉన్న మనస్సు అబద్ధం. మనస్సు అబద్ధం కాబట్టి బయట కూడా దానికి అబద్ధం గొడవే కావాలి. అబద్ధం నిజాన్ని ఎలా కోరుతుంది? దేవుడు అన్నా, కుండలినీ శక్తి అన్నా, ఆత్మ అన్నా, స్వర్గరాజ్యం అన్నా, మోక్షం అన్నా, ఇవన్నీ ఒకే వస్తువుకి పేరులు. మీ స్వరూపానికే ఈ పేరులన్నీ. మీ స్వరూపమే ఆత్మ, మీ స్వరూపమే దేవుడు, మీ స్వరూపమే కుండలినీ శక్తి, మీ స్వరూపమే స్వర్గ రాజ్యం, ఒకే దానికి రకరకాల పేరులు పెట్టారు. ఈ పేరులు చూసి మీరేమీ తొట్రుపాటు పడక్కరలేదు.

సాధనలు మీరు చేస్తే చెయ్యండి, బాధలు పడకండి! మీకు భక్తి లేకపోయిన నాకు ఇష్టమే కానీ బాధ పడకండి. భక్తి పేరు మీద బాధ పడకండి. మీరు ఇంట్లో బోలెడన్ని బాధలు పడుతున్నారు. మీకు ఇంటిలో మీ సంసారంలో మీకుండే బాధలు ఏవో మీకు ఉన్నాయి, భక్తి పేరు మీద మటుకు బాధపడకండి. మీరు మంచినీళ్ళు తాగుతుంటే బాధపడుతున్నారా? అన్నం తింటూ వుంటే బాధపడుతున్నారా? సినిమా చూస్తుంటే బాధపడుతున్నారా? మరి భక్తి గురించి సాధన గురించి బాధపడటం ఎందుకు? భక్తి వల్ల మీకు బాధ వస్తూ వుంటే ఆ భక్తి వద్దు! మీకున్న బాధలలోంచి విడుదల చెయ్యటానికి భక్తి కావాలా లేకపోతే కొత్తగా మిమ్మల్ని బాధలు పెట్టటానికి భక్తి కావాలా? మిమ్మల్ని బాధ పెట్టేది భక్తి ఎలా అవుతుంది అసలు? అందరూ నేను నేను అంటూ ఉంటారు కదండీ! పొద్దున్న లేచిన దగ్గరినుంచి సాయంత్రం వరకూ మీరు లెక్క పెట్టండి ఎన్నిసార్లు అంటున్నారో నేను నేను అని, నేను కూర్చున్నాను, నేను నుంచున్నాను, నేను ఉపకారం చేసాను, నేను అపకారం చేసాను, నేను మంత్రిని, నేను స్త్రీని, నేను పురుషుడిని, నేను సన్నగా ఉన్నాను, నేను నల్లగా ఉన్నాను, నేను ఊరు వెళ్ళాను, నేను ఊరినుంచి వచ్చాను, ఇలా నేను నేను అని ఎన్నిసార్లు అంటున్నారండీ! అన్నిసార్లు మీ నోట్లో ఈ నేనుని అరగతీస్తున్నారు కదా ఈ నేను ఏంటో తెలుసుకోవటానికి ఎప్పడైనా ప్రయత్నం చేసారా? నేను చచ్చిపోతున్నాను అంటారు, ఆ చచ్చిపోయే నేను ఎవరు? అందరూ నేను చచ్చిపోతున్నానండీ, మిమ్మల్ని చూడలని ఉంది ఒకసారి వస్తారా మీరు, అంటుంటారు. అయ్యబాబోయ్ నేను చచ్చిపోతున్నాను అంటారు, ఆ చచ్చిపోయేది ఎవడు? మిమ్మల్ని చూడాలని ఉంది అనేవాడు ఎవడు? వీటి గురించి మీరెప్పడైనా పరిశీలించారా అసలు? నాకంటే కూడా మీ నేను అంటేనే మీకు ఎక్కువ ఇష్టం. నన్ను ప్రేమిస్తున్నానని మీరు అనుకొంటున్నారు అది అబద్ధం. ఈ నేనే మిమ్మల్ని తిడుతోంది అనుకోండి, మీకు ఎంత కోపం వచ్చేస్తోందో, మీరు నన్ను నిజంగా ప్రేమిస్తుంటే, ఈ నేను మిమ్మల్ని తిడితే మీకు కోపం ఎందుకు వస్తోంది? అందుచేత నాకంటే మీకు మీ నేను ఎక్కువ ఇష్టం. దేవుడికంటే కూడా మీకు మీ నేను ఎక్కువ ఇష్టం.

చివరిసారిగా ఒకమాట చెప్పి మీ దగ్గర సెలవు తీసుకొంటున్నాను. నిండు మనస్సుతోటి నాతల వంచి చేతులు జోడించి మీకు నమస్కరించి మొదటి సారిగా చివరిసారిగా మరోసారి చెపుతున్నాను. మీరు లావుగా ఉన్నారా, సన్నగా ఉన్నారా అది

భగవంతుడు చూడడు. మీ దగ్గర ధనం ఉందా లేదా అనేది చూడడు. మీకు అధికారం ఉందా అధికారం లేదా అని చూడడు. మీరు రాజులా, బ్రాహ్మణులా, కోమట్లా లేకపోతే హరిజనులా అది కూడా భగవంతుడికి అక్కరలేదు. మీరు క్రైస్తవులా, మహమ్మదీయులా, హిందువులా అదీ భగవంతుడికి అక్కరలేదు. మీరు ఆడవళ్ళా, మగవాళ్ళా, పిల్లలా, పెద్దవాళ్ళా అది కూడా భగవంతుడికి అక్కరలేదు. మీకు చదువు ఉందా చదువులేదా అనేది కూడా భగవంతుడికి అక్కరలేదు. భగవంతుడికి మీ హృదయంలో కావలసింది ఒక్కటే. భగవంతుడే మీ హృదయంలో ఆత్మగా ప్రకాశిస్తున్నాడు. ఆత్మగా మీకు దర్శనం ఇవ్వటానికి మీలో ఆయన చూసేది ఒకటే ఒకటి. మీలో ఎంత పవిత్రత ఉంది, మీ హృదయంలో ఎంతవరకూ పవిత్రత ఉంది, అదొకటే ఆయన చూసేది. ఇక్కడ చదువు కాదు ధనం కాదు, చదువుతోటి ధనంతోటి మీరు భగవంతుడి దయను పొందలేరు, భగవంతుడి మీద ఒత్తిడి తీసుకురాలేరు. మనిషి హృదయంలో ఎంతవరకూ పవిత్రత ఉంది. మనిషి కనుక పరిపూర్ణంగా పవిత్రుడు అయితే వాడికి ఆత్మ దర్శనం అవుతుంది. అదే కడసారి జన్మ. మీరు భగవద్గీత చదువుతున్నారా, బైబిలు చదువుతున్నారా, ఖురాను చదువుతున్నారా అది కూడా ఆయనకి అక్కరలేదు. మీరు యాత్రలు చేసారా, దండలు వేసారా లేదా అది కూడా ఆయనకి అక్కరలేదు. మీ కళ్ళతోటి ఏమి చూస్తున్నారో మీ చేతులతోటి ఏమి చేస్తున్నారో అది కూడా ఆయనకి అక్కరలేదు. మీ హృదయాలు నిర్మలమైన హృదయాలేనా, పవిత్రమైన హృదయాలేనా, అది ఈశ్వరుడు చూసుకుంటాడు. మీరు ఎంతవరకూ పవిత్రులు అది ఈశ్వరుడు చూసుకుంటాడు. హృదయ శుద్ధి కలవారు ధన్యులు వారు దేవుని చూసెదరు అని ఏసు చెప్పాడు.

భగవంతుడి ముఖంలోంచి వచ్చిన మాటలు మీరు నమ్మటం మానేసి, నాకు భగవంతుడి మీద విశ్వాసం ఉంది అంటూ వెర్రికేకలు వేస్తే, భగవంతుడు వెర్రివాడా మీ మాటలు నమ్మటానికి? భగవంతుడు అంటే ఇష్టం అని మీరందరూ అంటున్నారు అనుకోండి, భగవంతుడి మీద మీకు నిజంగా ఇష్టం ఉంటే, మరి భగవంతుడు చెప్పిన మాటలు మీరు ఎందుకు నమ్మటం లేదు? మనకి విశ్వాసం ఉందా లేకపోతే విశ్వాస హీనులమా? యదార్థం చెప్పాలంటే మనందరమూ విశ్వాసహీనులము. ప్రత్యక్షంగా ఇక్కడ భగవంతుడు ఆత్మరూపంలో ప్రకాశిస్తుంటే, ఈ ఆత్మని ఎంతమంది విశ్వసిస్తున్నాం? మనం విశ్వాస హీనులం! విశ్వాసం ఉన్నట్టు నటిస్తున్నాం. జీవితాన్ని నటిస్తే అజ్ఞానం పెరుగుతుంది.

మనస్సుకి ఆత్మకి ఎట్టి సంబంధం లేదు. అయితే మనస్సు యొక్క పుట్టుక స్థానం ఆత్మ. ఆత్మనే కొందరు హృదయం అంటారు. మనస్సు హృదయంలో పుడుతుంది, శిరస్సులో విజృంభిస్తోంది. మనస్సు అంటే అనేక తలంపుల యొక్క పొరలు. ఈ తలంపులు సమూహాన్ని మనస్సు అంటాము. ఈ మనస్సు హృదయంలో అణిగి ఉన్నప్పుడు ఆ తలంపులు కనబడవు. తలంపు ఎప్పుడు కనిపిస్తుందంటే, తలంపు హృదయంలో పుట్టి శిరస్సులోకి వచ్చినప్పుడు, మెదడు మనకి పెద్దది చేసి చూపిస్తుంది. మీ హృదయంలో ఉన్న తలంపు మీ శిరస్సులోకి

కనుక రాకపోతే అసలు ఈ జన్మలో అది ఉన్నట్టే తెలియదు. మీ హృదయంలో అది ఉంది. మీ శిరస్సులోనికి కనుక రాకపోతే ఆ తలంపు ఉన్నట్టు మీకే తెలియదు. మీరు జ్ఞాపకం ఉంచుకోండి - అందరికీ ఏదో ఒక రోజున చావు వస్తుంది కదా! మనిషి మరణించేటప్పుడు ఈ తలంపులు ఒక తలంపు తరువాత ఒక తలంపు అన్నీ హృదయంలోంచి వచ్చి శిరస్సులో కదులుతూ ఉంటాయి. కదిలినప్పుడు ఏమవుతుంది అంటే మన తలంపులే కొన్ని మనకి ఇష్టం ఉంటాయి, కొన్ని తలంపులు మనకి ఇష్టం ఉండవు. బాగా ఇష్టమైన తలంపు, బలమైన తలంపు వచ్చిందనుకోండి ఇది బాగుంది అనిపిస్తుంది మనస్సుకి, గబుక్కున ఆ తలంపుని పట్టుకుంటుంది. ఆ తలంపుని ఎప్పుడైతే పట్టుకుందో అప్పుడు ప్రాణం ఆగిపోతుంది. ఆ తలంపుని పట్టుకొనేవరకూ ప్రాణం ఆగదు. ఎందుచేతనంటే మళ్ళీ జన్మని ఈ తలంపు నిర్ణయిస్తుంది, ఎటువంటి శరీరం రావాలి, ఎక్కడ ఏ వాతావరణంలో పుట్టాలి, ఎటువంటి ప్రారబ్ధం అనుభవించాలి. ఇవన్నీ చివరి తలంపుని బట్టి డిసైడ్ అవుతుంది.

కృష్ణుడు గీతలో ఏమన్నాడంటే, మరణించే టైములో నన్ను స్మరించినప్పటికీ మోక్షం పొందుతారు అన్నాడు. కానీ మరణించేటైములో ఆయనని స్మరించలేము. మరణించేటప్పుడు భగవంతుడు మనకి జ్ఞాపకం వస్తాడని మీరెవ్వరూ అనుకోవద్దు. జ్ఞాపకం రాడు మనకి, ఎందుచేత జ్ఞాపకం రాడు అంటే భగవంతుడికంటే ఎక్కువ ఇష్టమైన విషయాలు మనకు చాలా ఉన్నాయి అవే బయటికి వస్తాయి. అంటే భగవంతుడు అంటే ఇష్టం లేదని కాదు, అది పైసా వాటా. మిగతా 99 పైసల వాటా ప్రకృతి వాసనలు ఉన్నాయి. అందుచేత ప్రకృతి వాసనలు విపరీతమైన ఫోర్సు తోటి వచ్చేస్తాయి. గోదావరికి వరద వస్తే ఎలా వస్తుందో అలా మరణించేటప్పుడు త్వరత్వరగా వాసనలన్నీ బయటకి వచ్చేస్తాయి. భగవంతుడు అంటే కొంచెం ఇష్టం ఉంది మనకి, కానీ ఆ వాసనల ప్రవాహంలో గడ్డిపరక కొట్టుకొని పోయినట్టు ఆ వాసన కొట్టుకుపోతుంది. కృష్ణుడు చెప్పిన మాట నిజం కానీ మనం మరణించేటప్పుడు భగవంతుడిని స్మరించలేము. ఒకవేళ నోటితోటి రామకృష్ణ అన్నా, వీడి మనస్సు ఏం చేస్తోందో అది చూస్తాడు ఈశ్వరుడు, నోరు కాదు. మీరు ఆసనాలు వెయ్యటం వల్ల, బయట చెప్పే మాటల వల్ల భగవంతుడు మోసపోడు, మీ నోరు అనొచ్చు రామకృష్ణా అని, ఏమో మీ మనస్సు ఏమి చేస్తోందో? మీరు చెప్పేది హితవుగా, ఎదుటివాడికి అర్థం అయ్యేటట్టు, ఎదుటివాడి క్షేమం కోరుతూ మీరు మాట్లాడితే అది కూడా తపస్సుతోటి సమానమని చెప్పాడు భగవంతుడు గీతలో. తపస్సు అంటే ఏంటి అని మీరు భయపడకండి. మీరు రోజూ చేసుకునే పనులలో మీ మనస్సు పలచబడేలా చూసుకోండి అది తపస్సు. కానీ అది మీకు తెలియటం లేదు. మీరు దేవుడి దగ్గర ఒక పువ్వు పెడితేనో లేకపోతే రామా అంటేనో తపస్సు అనుకొంటున్నారు. నిత్య జీవితంలో మీరు చేసే పనులలో, మీకు వచ్చే ఆలోచనలలో, మీకు వచ్చే తలంపులలో మీరు బహుజాగ్రత్తగా ఉంటే, మీ మనస్సు పలచబడేలా మీరు చేసుకుంటే అది తపస్సుతోటి సమానం. అంతకుమించిన తపస్సులేదు. మనస్సు పలచబడకుండా జ్ఞానం రాదు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

అక్టోబర్ 20 జిన్నూరు శ్రీ రమణక్షేత్రంలో హైదరాబాద్ అమ్మాణి గారి ప్రవచనం

**శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805**

**SRI RAMANA KSHETRAM** A/c. No. 510101006497273
**CORPORATION BANK, PALAKOL Branch**
IFSC Code : **CORP0001613**

**ఆంధ్ర ఆశ్రమము, తిరువణ్ణామలై ఫోన్ : 04175-236174**
**For Accomodation : 9849124502, 7780639977**

**మీ 'రమణ భాస్కర' చందా గడువు ఆగస్టు నెలతో ముగిసింది. కావున రెన్యువల్ చందాను స్వయముగాగానీ, యం.ఓ ద్వారా గానీ కట్టవచ్చును. యం.ఓ చేయదలచిన వారు శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - 534 265 పేరున రు. 150/-లు పంపగలరు.**

## గురు శిష్య సంవాదము

తృటిలో మోక్షము కలుగజేయుడని ప్రార్థించిన ఒక వృద్ధునకు, శ్రీ శంకరాచార్యులకును మధ్య జరిగిన సంభాషణము.

శంకరులు : ఏ ప్రకాశముచేత నీవు దృశ్య వస్తువులనన్నిటిని తెలుసుకొనుచున్నావు?

వృద్ధుడు : పగలు సూర్యుని యొక్క ప్రకాశముచే, రాత్రి చంద్రుని యొక్కయు, దీపాదుల యొక్కయు ప్రకాశముచేత.

శంకరులు : ఆ సూర్యచంద్రాదులను దేనిచే తెలుసుకొనుచున్నావు?

వృద్ధుడు : నేత్రముల చేత తెలుసుకొనుచున్నాను.

శంకరులు : ఆ నేత్రములను దేనిచే తెలుసుకొనుచున్నావు?

వృద్ధుడు : బుద్ధి చేత తెలుసుకొనుచున్నాను.

శంకరులు : ఆ బుద్ధిని దేనిచేత తెలుసుకొనుచున్నావు? అనగా బుద్ధిని ప్రకాశింప చేయుచున్నదేది?

వృద్ధుడు : ఆత్మ వలన.

శంకరులు : ఆ ఆత్మయే సర్వప్రకాశము. అదియే నీ యదార్ధ స్వరూపము. అదియే నీవు. అట్టి నీ నిజ స్వరూపమునందు నిలకడ కలిగి యుండుము. అదియే దుఃఖ రహితమగు పరమానంద స్థితి. అదియే మోక్షము.

**ఓం తత్ సత్**

**(దిII 27-07-2018 గురుపూర్ణిమ సందర్భంగా)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# అహంకారాన్ని సమూలంగా నశింపచేయు మందు - నమ్రత

వ్యక్తి అదృశ్యమైనప్పుడు 'నేను-నాది' అనేది ఎక్కడా కనిపించదు. అహంకారం ఎప్పుడూ స్వీకరించే భాష. ప్రేమ సమర్పించే భాష. లేని గొప్పదనాన్ని ఉన్నదని చెబితే ఉన్న గౌరవం కూడా ఊడిపోతుంది. సొంత గొప్పతనం లేనివారు పెద్ద ఘనతను చెప్పకొని గర్విస్తారు. నిజమైన జ్ఞానం మనిషిలో సహనం, సంతోషం, దయ, వినయం మొదలైన సద్గుణాలను పెంపొందిస్తుంది. తాను జ్ఞానినైనా భ్రమ అహంకారాన్ని సింహాసనం ఎక్కిస్తుంది. నిజమైన జ్ఞానం కోసం అహంకారం కరిగి పోవటం అనివార్యం. వినయరాహిత్యం కాగితం పువ్వులాంటిది. కృత్రిమ వినయం రూపుమాపాలి. బలవంతంగా తెచ్చుకొన్న వినయం అజ్ఞానంతో పోషింపబడ్డ వినయం అది ఎంతో ప్రమాదమైనది. అందులో లేనిది ఉన్న దానిలా కనిపిస్తుంది. జ్ఞానమే మనకు స్వయంగా వినయమవుతుంది. శాంతి, సహనం, దయ, ప్రేమలతో కూడిన మానవత్వంలో దైవత్వం ఉట్టిపడేటట్లు జీవించాలి. నేను ఇతరులకంటే అధికంగా కనిపించాలనే తాపత్రయం ఉండకూడదు. ఒకవేళ మనలో నైపుణ్యం ఉంటే అది నాది కాదు పరమాత్మ తన నైపుణ్యాన్ని నా ద్వారా ఇతరులకు ఉపయోగపడాలనే దృక్పథంతో నాకా నైపుణ్యం ప్రదర్శించాడేకానీ వాస్తవానికి నాదికాదు. పనిచెయ్యటానికే నా బాధ్యత, ఫలితం పరమాత్మది అనుకోవాలి. ఇది మహాత్ములు ఈ దృక్పథంలో ఉంటారు. మనం ఆశించి పనిచేస్తే అది ఇంకో కర్మకు కారణం అవుతుంది. ఈ విశ్వాసం కలిగి ఉంటే ఏ ఆందోళన ఉండదు. భారం భగవంతునిపై ఉంచి మన కర్తవ్యాన్ని నిజాయితీతో చెయ్యాలి. సర్వానికీ ఆధారమైన భగవంతుడే నాకూ ఆధారం అని ఆయన యొక్క సర్వజ్ఞత్వాన్ని మనం గుర్తిస్తే ఆయన సహాయం పొందటం చాలా సులభం అంతా నీవే, నేను నీ వాడినే 'నీ ఇచ్ఛయే నెరవేరుగాక' అని ఆయన ఏది అనుగ్రహించినా స్వీకరించగలగాలి. అప్పడు అహంకారం జాడ ఉండదు. వేమన "తిట్టి కొట్టిరేని తిరిగి మాట్లాడక యూఱకున్న జాడ నిర్వికారమీద వాడగో పరమాత్మ వర్ణింప శక్యమా?" అన్నారు. అహంకారం అనేది దీర్ఘ వ్యాధి. గురువు సహాయంతో ఆరోగ్యాన్ని పూర్తిగా నయం చేసుకోవచ్చును. అహంకారాన్ని అణచుకోగలిగితేనే మహాత్ములను దర్శించగలము. అహాన్ని జయించిన పిదపే సత్యంలో ఉండి పరమానందాన్ని పొందగలము. శ్రీనాన్నగారు "అహంకారం యొక్క జాడ ఎక్కడ కనిపించినా దాన్ని వెంటాడి హతమార్చండి, అహంకారంలో జీవించేవాడు అజ్ఞానం చేతుల్లో జీవితం పొడుగునా బంధీగా ఉండిపోతాడు, ఓర్పును స్వరూపంగా ఎంచుకొన్నవాడు నిర్వికారంగా ఉంటాడు" అన్నారు. ప్రతీవ్యక్తి బలహీనతలతో అహంకారాన్ని పోషించుకొంటాడు. తన గురించి ఇతరులు మంచిగా చెప్పకోవాలి. తన బలహీనతలను తెలిపేవాడు శత్రువే అయిపోతాడు. మన వ్యక్తిత్వాన్ని నంజుకుతింటూ మన పెరుగుదలను నిరోధిస్తుంది. గురువును శరణుపొంది జన్మ సాఫల్యం పొందాలి.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966